క్లుప్తంగా

నేడు భారత రాజ్యాంగ పరిరక్షణ సభ

అమ్రాబాద్: అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో భారత రాజ్యాంగ పరిరక్షణపై మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ సభ ఉంటుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎల్లస్వామి తెలియజేశారు. బహిరంగ సభకు ప్రజాగాయకులు గద్దర్, ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. మండల ప్రజలు, అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు సర్పంచ్‌లకు శిక్షణ

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఈ నెల 18 నుంచి 20 వరకు కల్వకుర్తి పట్టణంలో శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, పరిశుభ్రత తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరుకావాలని సూచించారు.

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డికి సన్మానం

కల్వకుర్తి రూరల్: మాజీ మంత్రి, శాసన మండలి సభ్యుడు పట్నం మహేందర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సోమవారం పట్టణంలోని తిలక్‌నగర్ గోవిందు శ్రీనివాస్ ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను క్లబ్ అధ్యక్షుడు లయన్ కల్మిచర్ల రమేశ్ శాలువాతో సత్కరించారు. వారికి లయన్స్ క్లబ్ పంచాంగాన్ని బహూకరించారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహెద్, శ్రీధర్, శ్రీను, వీరేశ్, ప్రకాశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ

ఉప్పునుంతల: స్థానిక పీహెచ్‌సీని సోమవారం జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త(డీసీహెచ్‌ఎస్) రమేష్‌చంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని గదులను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. నూతనంగా నిర్మిస్తున్న సీహెచ్‌సీ నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్యాధికారి శివలీల, ఫార్మసిస్టు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఉప్పలట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఆడేందుకు పాఠశాలల్లో ఆటస్థలం, మంచి క్రీడ దుస్తులు ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉప్పలట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. అనంతరం 200 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు పూరి రమేష్, చిత్తరంజన్‌దాస్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రసన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్, సంగీత, పర్వతాలు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉత్తమ అవార్డులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రథమ, ద్వితీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. సీవీ రామన్ ఒలంపియాడ్ 2023 ప్రతిభా పరీక్ష ఉమ్మడి జిల్లాలో ఇటీవల నిర్వహించారు. ఈ పరీక్షలో తెలకపల్లి శాంతినికేతన్ విద్యార్థులు 9వ తరగతి శ్రీహర్షిణి, ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానం, 8వ తరగతి ప్రపుణ్య ఉమ్మడి జిల్లా ద్వితీయ స్థానంలో ప్రతిభ కనబరిచారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించినట్లు చెప్పారు.

రంజాన్ తోఫా పంపిణీ



పెద్దకొత్తపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకుని యాపట్లలో ప్రభుత్వం అందించిన రంజాన్ తోఫాలను ముస్లిం మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బద్రుద్దీన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. జహంగీర్, గౌస్, సాధిక్, కబీర్, నిరంజన్, మునీర్, పాల్గొన్నారు.

ముస్లిం పెద్దలకు సన్మానం

మన్ననూర్: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా మన్ననూర్‌లోని మసీద్ కమిటీ పెద్దలను అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది మసీద్ ఆవరణలో హిమామ్, హఫీజ్, మౌసన్‌లతో పాటూ కమిటీ అధ్యక్షుడు గయాజొద్దీన్, నయిముల్లా, నసీర్, చాంద్‌పాష, నిరంజన్‌లను సన్మానించారు. బుచ్చయ్య, ప్రణీత, సంబు శోభ, బాలమ్మ, సుజాత, రహీం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



బీఆర్‌ఎస్‌లో చేరిన రామాపురం గ్రామస్తులు

కొల్లాపూర్: రాజకీయాలకు అతీతంగా కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం, అమరగిరి, కొల్లాపూర్ పట్టణానికి చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. దర్గయ్య, నిరంజన్, రాంచందర్‌యాదవ్, కొమ్మగోపాల్‌యాదవ్, నాగరాజు, క్రాంతి పాల్గొన్నారు.

సబ్సిడీ డబ్బులు అందజేత

కొల్లాపూర్‌లో బుడగజంగాల కులస్తులకు గతంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించి సబ్సిడీ నిధులు మంజూరయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం అందజేశారు. వెంకటమ్మకు రూ.90 వేలు మణ్నెంకు రూ.50 వేలు, ఈదన్నకు రూ.50 వేలు అందజేశారు. కౌన్సిలర్ కృష్ణ, సతీష్, సుజాత, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కుటుంబాలకు పరామర్శ

కొల్లాపూర్‌లో వేర్వేరు కారణాలతో మృతిచెందిన, ప్రమాదాల్లో గాయపడిన వారి కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. పట్టణంలో అనారోగ్యంతో మృతిచెందిన జహీదాబేగం, ఇటిక్యాల బిచ్చమ్మ, అనంత రాములు కుటుంబాలతో పాటు ప్రమాదంలో గాయపడిన సత్యంను ఎమ్మెల్యే పరామర్శించారు.

బొడ్రాయి వేడుకల్లో ఎమ్మెల్యే

పెద్దకొత్తపల్లి: ఆదిరాలలో బొడ్రాయి పండుగ సంవత్సరం వేడుకల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం పాల్గొన్నారు. వెంకటేశ్వర్‌రావు, గణేష్‌రావు, భాగ్యమ్మ, కురుమయ్య పాల్గొన్నారు.

నల్లమల విద్యార్థుల ప్రతిభ



అవార్డు అందుకుంటున్న హలరాజు

అచ్చంపేట రూరల్: ఇటీవల నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి ఐఐటీ టాలెంట్ టెస్టులో అచ్చంపేటకు చెందిన జీఎస్‌ఆర్ ఆదిత్య, గీతాంజలి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుతో పాటు, ఉత్తమ పాఠశాల అవార్డును సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వెంకటరమణ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ హలరాజు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు చరణ్, జిల్లా స్థాయిలో సహస్ర, విశాలాక్షి, విద్యధరి, రాజు, తేజశ్రీ, వరుణ్ అవార్డులను అందుకోగా.. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుచరిండియా డైరెక్టర్ లయన్ డాక్టర్ వై.కిరణ్, సినీ నటుడు అడవి శేషు, చంద్రవ్వ, రఘునాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



అమ్రాబాద్‌లో ఎంపీపీ, ఎంపీడీఓలకు వినతి అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

అమ్రాబాద్: తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరి పిరియడ్ పూర్తయినా రెగ్యులరైజేషన్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇందుకు నిరసనగా టీపీఎస్‌ఎఫ్ పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి చేపట్టబోయే సమ్మె నోటీసును ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాంమోహన్‌కు అందజేసినట్లు చెప్పారు. నిరసన తెలిపిన వారిలో నాగేష్, మల్లేష్, ముత్యం, సంధ్య, గణేష్ ఉన్నారు.

క్రమబద్ధీకరించాలి

చారకొండ: మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను గుర్తించి వారి సర్వీస్ క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు గణేష్, రవిశంకర్, సైదులు, శ్రీలత, నజీమా తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



కురుమిద్దెలో పనులు పరిశీలిస్తున్న ఆంజనేయులు

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్దెలో ఎంపీడీఓ ఆంజనేయులు, సోమవారం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. గ్రామంలో కొనసాగుతున్న రోడ్డు పనులను పరిశీలించడంతో పాటు కూలీల హాజరు పట్టికనను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పథకం పనులను ఎంపీడీఓ రామ్మోహన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుకు సంబంధించిన మైనర్ పనులు, ఇదివరకే వ్యవసాయ పొలాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో ఉపాధి పథకం పనులకు వెళ్లే కూలీలకు పలు సూచనలు చేశారు. ప్రత్యేకించి ఎండలు ఎక్కువగా ఉన్నందున పనులు చేపడుతున్న పరిసరాల్లో టెంట్లు, తాగునీటితో పాటూ గ్లూకోస్ పౌడర్ పాకెట్లు తప్పకుండా ఉంచాలని ఈజీఎస్ నిర్వాహకులను అడగాలని అన్నారు. కర్ణబాబు, విష్ణు, విజయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: పదర మండలం వంకేశ్వరంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న పనులను సోమవారం ఎంపీడీఓ శంకర్‌నాయక్ సందర్శించి పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వేసవి అధికంగా ఉన్నందున ఉదయాన్నే పనులు చేసుకోవాలని సూచించారు. మస్టర్లను పరిశీలించారు. అవకతవకలు లేకుండా పనులు నాణ్యవంతంగా చేయాలని తెలియజేశారు.

లింగాల: మండల పరిధిలోని అప్పాయపల్లిలో పలు పథకాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎంపీడీఓ గీతాంజలి పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

వెల్దండ: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా ప్రజలు సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మండల స్థాయి అధికారులందరూ హాజరయ్యారు. ముఖ్యంగా వేసవిలో తాగునీరు సమస్య లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ట్యాంక్‌లను ప్రతివారం శుభ్రం చేయించి, తాగునీరు కలుషితం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్, ఎంపీడీఓ శ్రీనివాసులు, లలిత, శ్రీమతి, శ్యామ్‌సుందర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తులు నిల్

లింగాల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి తూతూమంత్రంగానే కొనసాగింది. ఎప్పటి మాదిరిగానే అధికారులు రావడం , దరఖాస్తుల కోసం ఎదురుచూసి, సమయం అయిపోయిన తర్వాత వెళ్లిపోయారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులకు ఎలాంటి పరిష్కారాలు లభించకపోవడంతో ప్రజలు వినతులు ఇవ్వడానికి ముందుకు రావడంలేదు. ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినాబేగం, విజయలక్ష్మి, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో ఒక దరఖాస్తు



పెద్దకొత్తపల్లిలో ప్రజావాణిలో దరఖాస్తు అందుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసులు

పెద్దకొత్తపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక దరఖాస్తు అందినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బ్యాగరి తిరుపతయ్య తన భూమిని సర్వే చేయించి రిపోర్ట్ ఇవ్వాలని ఫిర్యాదు చేశాడు. సర్వేయర్ బాబునాయక్‌తో భూమి సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని తహసీల్దార్ ఆదేశించారు. వ్యవసాయ అధికారి రమేష్‌నాయక్, వైద్య సిబ్బంది చెన్నయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జగదాంబ, ఏపీఎం అరుణ సమావేశానికి హాజరయ్యారు.

అధికారుల గైర్హాజరు

కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభరాణి, ఎంపీడీఓ కార్యాలయం నుంచి జూనియర్ అసిస్టెంట్ నిఖిత హాజరయ్యారు. ప్రజావాణికి ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ తెలియజేశారు.

ఇద్దరికి గాయాలు

వెల్దండ: మండల పరిధిలోని తుంకిబండతండా గేట్ వద్ద సోమవారం రాత్రి హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. భర్కత్‌పల్లికి చెందిన కేశమోని భూమయ్య ద్విచక్ర వాహనంపై ఆమనగల్లు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. చెర్కూర్‌కి చెందిన గౌడుగు భీమయ్య ద్విచక్రవాహనంపై వెనక వైపు వచ్చి ఢీకొట్టాడు. దీంతో భూమయ్య కాళ్లు విరిగాయి. దీంతో చికిత్స నిమిత్తం వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

చెక్కు అందజేత

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి పడమటి తండాలో ఆలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి తండాలో ఆలయ నిర్వాహకులకు సోమవారం రూ.50 వేల చెక్కు అందజేశారు. దేవాలయ అభివృద్ధికి మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గ్రామస్తులు మణిపాల్, గోపాల్ సింగ్, సోమ్లా, గోపి, సురేష్ తదితరులు ఉన్నారు.

భర్త నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు



కందనూలు: తన భర్త నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని తెలియజేస్తూ.. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఓ ఇల్లాలు ఎస్పీ మనోహర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. అనంతరం బాధితురాలు లక్ష్మి మాట్లాడారు. 17 ఏళ్ల కిందట తాడూర్ మండలం చెన్నోల కాలనీకి చెందిన రవితో వివాహమైందని, పెళ్లి తర్వాత రెండేళ్లు బాగానే ఉన్నామని, తర్వాతే తనని, అనుమానించడం, తాగి వచ్చి కొట్టడం తరచూ చేస్తున్నాడని చెప్పింది. పెద్దల సమక్షంలో మాట్లాడినా తీరు మారకపోవడంతో ఐదేళ్ల కిందట నుంచి విడిగా ఉంటున్నామని చెప్పింది. ఇటీవల ఫోన్ చేసి మాటల్లో చెప్పలేని పదాలతో తిడుతూ... చంపేస్తానని బెదిరిస్తున్నాడని చెప్పింది. నన్ను, నా ఇద్దరు పిల్లలకు రక్షణ కల్పించడంతో పాటు, మా భాగానికి వచ్చే పొలాన్ని తమ పిల్లల పేర్లపై చేయాలని కోరింది. మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న నా భర్త, అత్త, మామలపై చర్యలు తీసుకోవాలని కోరింది.

ఉపసర్పంచ్‌ని తొలగించాలని ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: మారేడుమాన్‌దిన్నెకు చెందిన ఉపసర్పంచ్ శ్రీధర్‌రావును తొలగించాలని ఆ గ్రామ సర్పంచ్ సునిత, వార్డుసభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో చేపట్టిన పనులకు చెక్కులపై సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నందున గ్రామపంచాయతీలో ఉపసర్పంచ్‌ని తొలగించాలని తీర్మానం చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అంబేడ్కర్ వేడుకలు జయప్రదం చేయండి

తెలకపల్లి: పూలే, అంబేడ్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్, జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న కోరారు. సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. భాస్కర్, హనుమంతు, జగదీశ్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

తెలకపల్లి: మండల పరిధిలోని లక్నారంలో సోమవారం కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన డాక్టర్ డి.శ్యాంసుందర్ తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాలగౌడ్, శ్యాంసుందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



డీపీఓకు వినతి

కందనూలు: వెల్దండ మండల కేంద్రంలో అక్రమంగా వెలిసిన జీపీ లేఅవుట్లలో పది శాతం ల్యాండ్ ఆక్రమణకు గురవుతుందని వెల్దండ మండలానికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, చంద్రమోహన్ రెడ్డి జిల్లా డీపీఓ అధికారి కృష్ణకు వినతి అందజేశారు. జోగయ్య, శ్రీను ముదిరాజ్, తిరుపతిరెడ్డి, భరత్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

తాడూరు: రాబోయే ఎన్నికల్లో గ్రామీణ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు గ్రామాలవారీగా బూత్ కమిటీలను ఎంపిక చేస్తున్నట్లు బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండనాగేష్ అన్నారు. సోమవారం మండలంలోని గుంతకోడూరులో బూత్ స్వశక్తికరణ కార్యక్రమంలో భాగంగా ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. మల్లేష్, శ్రీను, భాస్కర్, కిరణ్ తదితరులను ఎన్నుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని సమ్మె



నాగర్‌కర్నూల్‌లో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న పొదిల రామయ్య

వెల్దండ: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలో సోమవారం ఐకేపీ వీఓఏల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఐకేపీ వీఓఏలకు ఉద్యగ భద్రత కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఐకేపీలో ఉద్యోగులుగా పనిచేస్తున్న వీఏఓలకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. వీఏఓల మండల అధ్యక్షురాలు జంగమ్మ, కార్యదర్శి వసంతి, వనిత, మహిపాల్, శ్రీనునాయక్, చంద్రశేఖర్ ఉన్నారు.

బిజినేపల్లి: ఐకేపీలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

తెలకపల్లి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో వీఓఏల నిరవధిక సమ్మెను ఆయన ప్రారంభించారు. రైతు సంఘం నాయకులు లక్ష్మణ్, మహేష్, విజయ్‌గౌడ్, నాగలక్ష్మి, సుధ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఐకేపీ వీఓఏలు ఒకరోజు ధర్నా చేపట్టారు. సుమతి, సుగుణ, కృష్ణవేణి, అఖిల, చందన తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఐకేపీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వీఓఏలు సోమవారం నిరవధిక సమ్మెను ప్రారంభించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సుస్థిర పాలన



గువ్వలోనిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుస్థిర పాలన ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని గువ్వలోనిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటికీ తిరిగి వరంగల్ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించారు. రైతులకు, రైతు కూలీలకు ఉచిత బీమా కల్పించడంతో పాటు సొంత స్థలం ఉన్న నిరుపేద కుటుంబాలకు రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, రాములు, నారయ్య, ఇద్దయ్య, హరికృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

కోడేరు: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిదెల రాము అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. చామంతి రాజు, నాగేష్‌రెడ్డి, శ్రీశైలం, చెన్నకేశవులు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు



అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

బిజినేపల్లి: గ్రామంలో, వీధుల్లో, ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు అదుపు చేయవచ్చని, సమస్యలు కూడా త్వరగా పరిష్కారం అవుతాయని తిమ్మాజిపేట హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్ మొయినుద్దీన్ అన్నారు. పెద్దగృహాలు ఉన్న వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామపంచాయతీ కూడా దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సోమవారం తిమ్మాజిపేట మండలంలోని ఇప్పలపల్లిలో కమ్యూనిటీ పోలిసింగ్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కానిస్టేబుల్ బాలస్వామి, రాఘవేందర్, విష్ణు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: నియోజకవర్గంలో పేద ప్రజలే అధికంగా ఉన్నారని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేటలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ పాండునాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. పట్టణంలోని సాయినగర్ కాలనీలో గతంలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, దళారుల ప్రమేయం లేకుండా, రాజకీయాలకు తావులేకుండా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడాలి




వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, స్థలాలను కాపాడాలని కోరుతూ సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డిలు జిల్లా డీపీఓ కృష్ణకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నంబర్ 705లో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపట్టారన్నారు. జీపీ లేఅవుట్‌లోని 10శాతం భూమి ఆక్రమణకు గురవుతుందని ఆరోపించారు. జోగయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే మర్రి పరామర్శ

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో ఆదివారం ఉదయం విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన రమేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రమేష్ భార్య శ్రావణికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగ అవకాశం కల్పిస్తానని చెప్పారు.

కేసీఆర్ కిట్ అందజేత



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లికి చెందిన స్వాతికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కాన్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన కేసీఆర్ కిట్‌ను సోమవారం వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌అభిరాం అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా దళితబంధు ఇవ్వాలి



తాడూరు: దళితుల సంక్షేమం కోసం చేపట్టిన దళితబంధు పథకంలో రాజకీయాలకు తావు లేకుండా జిల్లా స్థాయి అధికారుల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కు సమస్యలతో కూడిన వినతి అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు హనుమంతు, జగన్, వెంకటయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఇవ్వాలి

కల్వకుర్తి రూరల్: రాజకీయాలకు అతీతంగా ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు పథకం వర్తింపజేయాలని కులవివక్ష వ్యతిరేఖ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సోమవారం కల్వకుర్తికి చేరుకుంది. ఈ సందర్భంగా పాలమూరు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లాలో దళితులపై దాడులు పెరిగిపోతున్నా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టడంలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు కాశన్న హనుమంతు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కౌన్సిలర్ శ్రీనివాస్, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తెలకపల్లి: చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తబితారాణి, ఏఎస్‌ఐ అంజయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆర్‌ఎస్ స్కూల్ యాజమాన్యం స్పందించి ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో మేలన్నారు. తహసీల్దార్ తబితారాణి, ఏఎస్‌ఐ అంజయ్య, పాఠశాల కరస్పాండెంట్ రాజు, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



ఆలయం నుంచి ప్రారంభమైన పొన్నసేవ

లింగాల: మండల కేంద్రంలో కోదండరామాలయంలో గత నెల 30 నుంచి ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి నిర్వహించిన 'పొన్న సేవ'తో ముగిశాయి. ఈ సందర్భంగా పల్లకిని పొన్నచెట్టు కొమ్మలతో అలంకరించి ఉత్సవ మూర్తులను ఉంచి బోయలు పల్లకిని మోయగా.. పట్టణంలోని ప్రధాన వీధుల వెంట భజంత్రీలతో ఊరేగించారు. ఆలయంలో స్వామి వారి కల్యాణంతో పాటు ప్రధాన ఘట్టాలైన చిన్న, పెద్దతేరు రథోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మోపతయ్య రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.